సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

ఓటర్ల సర్వే శతశాతం పూర్తి

రేషనలైజేషన్‌పై దృష్టి సారిస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక : కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటర్ల జాబితాల్లోని మార్పులు, చేర్పుల కోసం చేపట్టిన సర్వే గాజువాక నియోజకవర్గంలో దాదాపు పూర్తయింది. 305 పోలింగ్ కేంద్రాలున్న గాజువాకలో 3,12,733 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,58,231మంది, మహిళలు 1,54,486మంది ఉన్నారు. మిగిలిన 16 మంది ట్రాన్స్‌జెండర్లు. సర్వే అనంతరం వివిధ కారణాల రీత్యా 9608 మంది ఓటర్లు తొలగించడానికి దరఖాస్తులు అందగా, 8516 మంది మార్పులు, చేర్పులకు దరఖాస్తు చేసుకున్నారు. మరో 6318 మంది తమ ఓటు నమోదుకు దరఖాస్తు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

రాజకీయ పార్టీల సమన్వయంతో..

ఓటరు నమోదు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండటంతో పాటు రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతో సర్వే త్వరితగతిన పూర్తి చేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. ఓటర్ల సర్వేను ఎన్నికల నమోదు అధికారులు, సహాయ అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి నిర్వహించిన సర్వే వివరాలను వెల్లడించడంతో పాటు మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల జాబితాలను రూపొందించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వాటిపై అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం అభ్యంతరం లేని ఓటర్లను జాబితాల నుంచి తొలగించారు.

వెయ్యి డోర్ నంబర్లలో 13,672 మంది ఓటర్లు

3.12 లక్షలకు పైగా ఓటర్లున్న నియోజకవర్గంలో ఒకే ఇంటి డోరు నంబర్‌పై పది మందికి పైగా ఓటర్లు చాలాచోట్ల ఉన్నారని, అనేకమంది డోర్ నంబర్ లేకుండా ఉన్నారంటూ ఎన్నికల నమోదు అధికారులకు ఫిర్యాదులు అందడంతో సంబంధిత సిబ్బంది ఆ దిశగా కూడా సర్వే పూర్తి చేశారు. జీవో డోర్ నంబర్‌పై 54 మంది ఓటర్లున్నట్టు గుర్తించినట్టు చెబుతున్నారు. ఒకే డోర్ నంబర్‌లో పది మందికి పైగా ఓటర్లున్నట్టు అందిన ఫిర్యాదుపై సర్వే నిర్వహించిన అధికారులు వాటిపై ప్రాథమిక సమా చారాన్ని సేకరించారు. సుమారు వెయ్యి డోర్ నంబర్లలో 13,672 మంది ఓటర్లున్నట్టు గుర్తించారు. అద్దెకు ఇంట్లో ఉండి ఆ తరువాత ఖాళీ చేయడం, తమ ఓటును అక్కడికి మార్చుకోకపోవడం, అదే ఇంట్లోకి కొత్త వారు వచ్చి తమ ఓటును నమోదు చేసుకోవడం వంటి కారణాలరీత్యా ఇలాంటివి ఉన్నట్టు గుర్తించారు. వాటిని త్వరలో చేపట్టనున్న రేషనలైజేషన్‌లో సరిచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సర్వేను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసి అక్టోబర్ నాటికి ఓటర్ల రేషనలైజేషన్ పూర్తి చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

మొత్తం ఓటర్లు	:3,12,733
పురుషులు	:1,58,231
మహిళలు	:1,54,486
ట్రాన్స్‌జెండర్లు	:16
సర్వే శాతం	:98.77%
మొత్తం బీఎల్‌వోలు	:305
జీరో డోర్ నంబర్లలో ఓటర్లు	:54
వందేళ్లు దాటిన ఓటర్లు	:5
పది ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు ఉన్న దోర్ నంబర్లు	:1,000
వాటిలో ఓటర్లు	:13,672
కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసినవారు	:6,318
తొలగించడానికి అందిన దరఖాస్తులు	:9,608
మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసినవారు	:8,516

సర్వే పూర్తి చేశాం

- ఓటర్ల నమోదు అధికారి లక్ష్మారెడ్డి

ఓటర్ల జాబితాలపై ఇంటింటి సర్వే నూరుశాతం పూర్తి చేసినట్టు ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులతో గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటి సర్వేలో 3,12,057 మంది ఓటర్లను సర్వే చేశామని తెలిపారు. కొత్తగా ఓట్లు నమోదు చేసుకోవడం కోసం 6318 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఓట్ల తొలగింపునకు 9608 దరఖాస్తులు, మార్పులు, చేర్పుల కోసం 8516 మంది నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిపై త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి, జీవీఎంసీ ఈఈ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 929వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన టీపీపీ, పీఈఎం, ఆర్‌ఈడీ, ఎస్ఎండీ, స్టోర్స్ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కర్మాగారాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు క్రీడాకారులకు పతకాలు



కె.ఆదినారాయణ



ఎం.భాస్కరరావు

పెదగంట్యాడ: ఈ నెల 25 నుంచి 27 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ నగర్‌లో సెక్టార్-6 ఖాళీ బడి భవన్‌లో నిర్వహించిన 29వ జాతీయ క్రీడా పోటీల్లో పెదగంట్యాడకు చెందిన ఇద్దరు ఉక్కు క్రీడాకారులు సత్తా చాటి, పతకాలు దక్కించుకున్నారు. పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలలో మొత్తం 300 మంది క్రీడాకారులు హాజరు కాగా.. స్టీల్‌ప్లాంట్ నీటి సరఫరా విభాగానికి చెందిన కె.ఆదినారాయణ బెంచ్ ప్రెస్‌లో రజత పతకం, డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. అదే విభాగానికి చెందిన ఎం.భాస్కరరావు బెంచ్ ప్రెస్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. వీరికి అక్కడి రిఫరీ రాజ్ మహావీర్ సింగ్ పతకాలు అందజేసి అభినందించారు. గాజువాక చేరుకున్న వీరికి స్థానిక క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ స్కూల్ క్విజ్ విజేత ఢిల్లీ పబ్లిక్ స్కూల్



క్విజ్ పోటీల విజేతలతో స్టీల్‌ప్లాంట్ జీఎం ఠాగూర్, అధికారులు

ఉక్కునగరం: ఇంటర్ స్కూల్ క్విజ్ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మొదటి స్థానం కైవసం చేసుకుంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఈ పోటీల్లో ఉక్కునగరం, పెదగంట్యాడకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సోరమ్ స్వరూప్ బెహరా, కె.సూర్య సిద్ధార్థలతో కూడిన డీపీఎస్ జట్టు మొదటి స్థానం కైవసం చేసుకోగా ఆర్.శుభ శంకర్ దీక్షిత్, తేజస్ హెగ్డేలతో కూడిన శివశివానీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఎల్.బి.అమూల్య, బి.స్నేహలతో కూడిన డీపీవీ జట్టు మూడో స్థానంలో నిలిచింది. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ క్విజ్ పోటీలు ప్రారంభించారు. హెచ్‌ఆర్‌డీ జీఎం టి.కె.ఎస్.ఆర్.ఠాగూర్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగాధిపతి అమిత్ ఘడాయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ తమిళ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ తమిళ ఉద్యోగులకు చెందిన తమిళ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉక్కునగరంలో మంగళవారం జరిగిన సంఘం వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ సలహాదారుగా ఆర్.వెంకటేష్, అధ్యక్షునిగా ఎన్.సురేష్, కార్యదర్శిగా ఆనందరామన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సి.అశోకన్, ఉపాధ్యక్షులుగా కేక్ మోహన్, కుమార్, ముత్తురామన్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా నవీన్ రాజా, సంయుక్త కార్యదర్శులుగా మోహన్ కాంతన్, రేఖా శరవణన్, మోహన్ సూర్యనారాయణ, రామకృష్ణన్‌లను ఎన్నుకున్నారు. వీరితో పాటు సెక్టార్ల వారీగా ప్రతినిధులను ప్రకటించారు.

పరిశుభ్రంగా శ్మశానవాటిక మార్గం



రోడ్డు శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: దహన సంస్కారాలకు అనువుగా ఉండేలా శ్మశానవాటిక రహదారి సిద్ధం చేస్తున్నామని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి తెలిపారు. వార్డు పరిధిలోని దేవాడ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో, శ్మశానవాటికలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను మంగళవారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్మశానవాటిక మార్గంలో తుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు వస్తున్నందున ఈ ప్రాంతం శుభ్రం చేయించనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తిరుమల బాలాజీ శాంతి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మంగళవారం శాంతి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుక జరిపించారు. వందలాదిమంది భక్తులు కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రక్షణగోడ నిర్మాణ పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ చందు

గాజువాక : జీవీఎంసీ 70వ వార్డు దశమి కొండ కాలనీలోని కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి కార్పొరేటర్ ఉరుకూటి చందు మంగళవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చామని, అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాలఘాట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారం



యునైటెడ్ ఫ్రంట్ నిర్వహించిన సభలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు



బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రచారసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: భెల్ గుర్తింపు సంఘం ఎన్నికలు దగ్గర పడడంతో యూనియన్ల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 31వ తేదీన జరిగే ఎన్నికల సందర్భంగా సంస్థ ప్రధాన గేటు ఎదురుగా మంగళవారం ప్రోగ్రెసివ్ ఫ్రంట్ బలపర్చిన బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్‌తోనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్యానెల్‌లో వైఎస్సార్‌టీయూసీతో భాగస్వామ్యం కలిగి ఐఎన్‌టీయూసీ, సీఐటీయూతో పాటు ఏఐసీటీయూ సమర్థవంతమైన నాయకత్వం కలిగిన యూనియన్లు ఉన్నాయన్నారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు జి.టి.పి.ప్రకాష్, ఉరుకూటి బాబూరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటక్ అఖిల భారత్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, భెల్ ఇంటక్ నాయకులు ఎం.ఎ.రెహమాన్, చీఫ్ పేట్రన్స్ దామోదర్ రెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, ఇంటక్ నాయకుడు నాగభూషణం, స్టీల్‌ప్లాంట్ సిటూ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, ఎస్.వి.ఎస్.ఆర్.పట్నాయక్, పి.ఆనందకుమార్, వారాడ ఆనందరావు, సీహెచ్.సీతంనాయుడు, వైఎస్సార్‌టీయూసీ నాయకులు రోమాల అప్పారావు, ఎన్.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తమ యూనియన్‌ను గెలిపిస్తే భెల్‌లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని భెల్ జేఎన్‌సీ మెంబర్ ఎస్.డి.వి.కృష్ణంరాజు అన్నారు. మంగళవారం యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అభ్యర్థులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, సీహెచ్.ఎస్.ఎన్.రాజు, ఎ.వెంకటేశ్వరరావు, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఫాగింగ్ యంత్రం ప్రారంభం



మెగా ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: డెంగ్యూ, మలేరియా జ్వరాలకు కారణమైన దోమల నివారణ కోసం చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. డెంగ్యూ నివారణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ కోసం మెగా ఫాగింగ్ యంత్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెగా ఫాగింగ్ మిషన్ ద్వారా జోన్-6 పరిధిలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సాంబమూర్తి, విష్ణు, ఎస్.వై. నాయుడు, బొడ్డు గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



లంకెలపాలెం హైస్కూల్‌లో విద్యార్థుల విన్యాసాలు



హెచ్ఎం నాగేశ్వరరావు, అతిథులతో బహుమతులు అందుకున్న విద్యార్థులు

అగనంపూడి: పాఠశాల స్థాయిలో క్రీడలకు తగిన ప్రాధాన్యతనిస్తున్నామని లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీరాణి, ఉపాధ్యాయులు కె.రమణ, పండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్తా చాటుతున్న సాయిసాహితి



సాయిసాహితి

విశాఖ స్పోర్ట్స్ : నగరానికి చెందిన సాయిసాహితి స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటుతోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన పసిఫిక్ కప్ ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్ బాలికల విభాగంలో సాయిసాహితి ద్వితీయస్థానంలో నిలవగా...ఫ్రీ స్కేటింగ్ బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది. ఫిగర్ స్కేటింగ్ ఓవరాల్‌లో సాయిసాహితి తృతీయస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు పన్నెండేళ్ల ప్రాయంలోనే పలు జాతీయస్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ తలపడి ఆర్టిస్టిక్ విభాగంలో పలు పతకాలను సొంతం చేసుకుంది. వరల్డ్‌స్కేట్ ఓషియేనియా ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆస్ట్రేలియా,న్యూజిలాండ్, బ్రెజిల్, భారత్, జపాన్, చైనీస్ తైపెయ్, యూఎస్ఏ స్కేటర్లు జట్లు పాల్గొన్నాయి.

తేనె వంటిది తెలుగు భాష

- వ్యావహారిక భాషావ్యాప్తికి గిడుగు సేవలు చిరస్మరణీయం
- కొనియాడిన వక్తలు
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



అగనంపూడి హైస్కూల్‌లో తెలుగు తల్లి అలంకరణలో విద్యార్థి, సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు



లంకెలపాలెం హైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు



గిడుగు, ధ్యాన్‌చంద్‌ల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న లంకెలపాలెం హెచ్‌ఎం నాగేశ్వరరావు

అగనంపూడి: గ్రాంథికంలోని తెలుగును వాడుకభాషలోకి తీసుకువచ్చి, తెలుగు భాష తీయదనాన్ని రుచి చూపించిన వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అని అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఎం.కృష్ణారావు అన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అగనంపూడి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరించేందుకు వారం రోజుల పాటు పాఠశాలలో వివిధ పోటీలు నిర్వహించామన్నారు. కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, ప్రతినిధులు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మభాష గొప్పదనం, మాధుర్యాన్ని ప్రతీ విద్యార్థి తెలుసుకోవాలని లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష, సంస్కృతిపై పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్తమ ప్రదర్శనలకు విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కె.రమణ, పీడీ లక్ష్మీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగును కాపాడుకోవాలి

పెదగంట్యాడ: తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. నెల్లిముక్కు కూడలిలో గిడుగు రామమూర్తి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను, పెరుమాళ్లు, అప్పలరెడ్డి పెంటయ్య, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భువన విజయం



భువన విజయం లఘు నాటికలో కవుల వేషధారణల్లో బాలికలు

అక్కిరెడ్డిపాలెం: తెలుగు ఔన్నత్యాన్ని చాటుతూ తెలుగు భాషా దినోత్సవాన్ని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష గొప్పదనం గురించి హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం విద్యార్థులకు వివరించారు. శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో కవుల గురించి తెలియజేస్తూ భువన విజయం అనే లఘు నాటికను 9వ తరగతి విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అత్తా-కోడళ్ల హాస్య నాటిక ఆకట్టుకుంది. విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ గురించి 8వ తరగతి విద్యార్థిని వి.అతిథి వివరించింది. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు వి.ఆర్.శ్రీనివాస్, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో..



కణితి హైస్కూల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు వై.రామశేషు విద్యార్థులకు తెలుగుభాష గొప్పదనం, చరిత్ర వివరించారు. 9వ తరగతి విద్యార్థి భాస్కర్ పౌరాణిక పద్యాలను, మరో విద్యార్థి పురుషోత్తం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. విద్యార్థిని చాందిని తెలుగు భాషకు కవులు చేసిన సేవలను వివరించింది. విద్యార్థినులు పలు జానపద నృత్యాలను, లఘు నాటికలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పలువురు కవుల చిత్రపటాలను ప్రదర్శించి, వారి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని రమాకుమారి, కౌసల్య, కృష్ణారావు, వై.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఓనం పండగ



విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి

అక్కిరెడ్డిపాలెం: కేరళీయుల ముఖ్య పండగ ఓనంను షీలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం కనులపండువగా నిర్వహించారు. విశేష అలంకరణలో అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే కేరళీయులు సంప్రదాయ దుస్తుల్లో గుడికి వచ్చి, స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

మిస్సింగ్ జీతాల చెల్లింపునకు వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక : గత జూన్ నెలలో మిస్ అయిన తమ జీతాలను ఇప్పించాలని కోరుతూ 68, 69 వార్డుల పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాతయ్యపాలెం నుంచి ర్యాలీగా వచ్చి గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు వినతి పత్రం అందజేశారు. జూన్‌లో తమ జీతాలు మిస్ అయ్యాయని, దీనిపై అనేకసార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఎ.లోకేష్, ఎం.రాంబాబు, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా



బీమా నగదు అందజేస్తున్న నాయకులు

గాజువాక : 67వ వార్డు గణేష్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన మహ్మద్ జలాల్ కుటుంబానికి వైఎస్సార్ బీమా ద్వారా రూ.1 లక్ష మంజూరైంది. ఈ మొత్తంలో తక్షణ సాయం కింద రూ.10వేలను మృతుని కుటుంబానికి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా చినతల్లి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎం.డి.గౌస్ మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ మిగిలిన రూ.90వేలు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లా పెంటారావు, అబ్దుల్ సాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com